సాక్షి అనకాపల్లి

గురువారం ı 17 ı ఏప్రిల్ ı 2025



చార్లీ చాప్లిన్‌కు నివాళి

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ హాస్య నటుడు చార్లీ చాప్లిన్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.



ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: విశాఖ దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు.



జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ

మహారాణిపేట: కైలాసపట్నం బాణసంచా పేలుడులో గాయపడ్డవారిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర పరామర్శించారు.

న్యూస్‌రీల్

నూకాంబిక హుండీ ఆదాయం రూ.41.52 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీల లెక్కింపు ద్వారా రూ.41,51,973ల నగదు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు తెలిపారు. ఈ ఏడాది మార్చి 15 నుంచి ఏప్రిల్ 16 వరకు నెల రోజుల్లో నగదు రూపంలో ఈ మొత్తం వచ్చిందని, ఇంకా 15.5 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి వస్తువులను భక్తులు సమర్పించినట్లు తెలిపారు.

ప్లానింగ్ కమిషన్ సమావేశానికి ఇద్దరు ప్రజాప్రతినిధులు



గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు



అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు

గొలుగొండ/అనకాపల్లి: తిరుపతిలో గురువారం జరిగే 16వ ప్లానింగ్ కమిషన్ సమావేశానికి జిల్లా నుంచి ఇద్దరు ప్రజాప్రతినిధులకు ఆహ్వానం అందింది. గొలుగొండ జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. మూడు విభాగాల్లో గ్రామీణ ప్రజాప్రతినిధులతో ప్రణాళికా సంఘం సమావేశం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 9 మంది సర్పంచ్‌లు, ఐదుగురు ఎంపీపీలు, నలుగురు జెడ్పీటీసీలను ఎంపిక చేయగా అందులో జిల్లా నుంచి ఇద్దరు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సూరిబాబు, జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిధుల అవసరాలపై చర్చిస్తారని తెలిపారు.

తల్లిపై చేయి చేసుకున్న వ్యక్తి అరెస్ట్



పల్లా నానాజీ

కశింకోట: తల్లిని ఎందుకు కొడుతున్నావని అడగడానికి వెళ్లిన పోలీసులపై దాడి చేసి చేయి చేసుకున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. మండలంలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన పల్లా నానాజీ తన తల్లి వెంకయ్యమ్మను కొట్ట సాగాడు. దీంతో తల్లి పోలీసు కంట్రోల్ రూమ్ 112 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారించడానికి వెళ్లి నానాజీని ప్రశ్నించారు. దీంతో వారిపై కూడా చేయి చేసుకున్నాడు. ఒకరి వేలు కూడా కొరికాడు. నానాజీని పట్టుకొని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

● షైనింగ్ స్టార్స్‌కు జేజేలు

నాటి సంస్కరణలే.. నేటి మెరుపులు



బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట హైస్కూల్





వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా అభివృద్ధి చెందిన పాఠశాలలెన్నో..



రావికమతం మండలం మేడివాడ జెడ్పీ హైస్కూల్

విద్యను విత్తనంగా నాటారు.. వసతులు సమకూర్చారు.. ఆధునికతను జోడించారు.. చిత్తశుద్ధి చూపించారు.. అందుకు ఫలితమే నేడు ప్రభుత్వ కళాశాలల్లోని ఇంటర్ విద్యార్థుల విజయం. షైనింగ్ స్టార్స్ పేరిట ఇంటర్మీడియట్‌లో టాపర్స్‌ను విజయవాడలో ప్రభుత్వం సత్కరించింది. అందులో 99 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యా ప్రమాణాలను పెంచడంతోనే వీరికి ఇంతటి ఘనత సాధ్యమయింది.

నర్సీపట్నం/రావికమతం/కశింకోట/రోలుగుంట:

వారు ఏడో తరగతిలో ప్రవేశించేనాటికి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ప్రభుత్వ విద్యా సంస్థలను కనీ వినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేయడంతో చక్కని విద్యను అందుకున్నారు. నాటి సర్కారు డిజిటల్ విద్యను అందుబాటులోకి తేవడంతో విజ్ఞాన విహంగాలై ఎగిరి ఐక్యరాజ్యసమితి, వైట్‌హౌస్‌లో కూడా అడుగుపెట్టారు. మన ఘనతను చాటారు. వారే ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు రాశారు. వారిలో మెరికల్లాంటి విద్యార్థులెందరో 950 మార్కులు దాటి సాధించారు. రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచిన అనకాపల్లి జిల్లా విద్యార్థులు ఐదుగురు.. విజయవాడలో సత్కారం అందుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు ప్రతీకలుగా నిలిచారు.

సిరసపల్లి హరిత

నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూపు అయిన ఎంఎల్టీ కోర్సులో 989 మార్కులు సాధించిన సిరసపల్లి హరిత ప్రభుత్వ పురస్కారం అందుకుంది. రావికమతం మండలం, మేడివాడ గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని అదే జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేసింది. వైద్యరంగంపై ఉన్న మక్కువతో ఎంఎల్టీ కోర్సులో చేరి మంచి గుర్తింపు తెచ్చుకుంది. వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలో మేడివాడ హైస్కూల్ ఎంతో అభివృద్ధి చెందింది. కార్పొరేట్ స్కూళ్లను తలపించే బెంచీలు, చక్కని భవనాలు, పచ్చని గార్డెన్, చక్కని సౌకర్యాలు విద్యార్థుల్లో విశ్వాసం పెంచాయి. చదువుకునే వాతావరణం కలిగించాయి. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విద్యా ప్రమాణాలు పెరిగాయి. ఫలితంగా హరిత లాంటి విద్యార్థులెందరో నాడు టెన్త్‌లో, నేడు ఇంటర్లో రాణించారు. హరిత చదువుకున్న నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా నాటి ప్రభుత్వం నాడు–నేడు కింద రూ.1.25 కోట్లతో అభివృద్ధి చేసింది. అనేక మౌలిక వసతులను కల్పించింది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది.

కంట్రెడ్డి రాజులమ్మ

కశింకోట మండలంలోని తేగాడలోని కస్తూర్బా గాంధీ విద్యాలయలో చదివి రాజులమ్మ ఇంటర్మీడియట్ బైపీసీలో 983 మార్కులు సాధించింది. రాష్ట్రంలోని కేజీబీవీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట హైస్కూల్లో అత్యధిక మార్కులతో టెన్త్ ఉత్తీర్ణత సాధించింది. నాడు–నేడులో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లలో విద్యాభివృద్ధికి ఎన్నడూ లేని విధంగా నిధులు కేటాయించి పాఠశాలలు, విద్యా సంస్థలను అభివృద్ధి చేయడంతో ఇలాంటి విద్యార్థులెందరో అద్భుతాలు సృష్టిస్తున్నారు. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా.. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చినా ఆధునిక వసతులతో కూడిన పాఠశాలలో చదివి రాజులమ్మ చక్కని ఫలితాలను సాధించింది. డాక్టర్ కావాలన్నది ఆమె కోరిక.

కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో చదివించే పరిస్థితి లేదని తండ్రి నాయుడు మథనపడుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తే వైద్య విద్య చదివించాలని భావిస్తున్నానని సాక్షికి తెలిపారు. అందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ చెప్పారు.

రావుల మౌళి కిరణ్

నర్సీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఅండ్‌ఆర్‌ఎం (బ్యాంకింగ్ అండ్ రిటైల్ మార్కెటింగ్) బ్రాంచ్‌లో ఇంటర్ చదివిన రావుల మౌళి కిరణ్ 978 మార్కులు సాధించి పురస్కారం అందుకున్నాడు. అతను నర్సీపట్నం మండలం గబ్బాడ హైస్కూల్లో చదువుకున్నాడు. రూ.75 లక్షలు కేటాయించి నాడు–నేడుతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఈ పాఠశాలను దీర్చిదిద్దారు. మినరల్‌వాటర్ ప్లాంట్లు, డిజిటల్ క్లాసు రూములు, బెంచీలు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేశారు. ఇవన్నీ కిరణ్ చదువుకు ఎంతో దోహదపడ్డాయి.

గొలగాన శ్రీను

కొత్తకోట జూనియర్ కాలేజీలో ఒకేషనల్ కోర్సులో 941 మార్కులు సాధించిన దివ్యాంగ విద్యార్థి శ్రీను షైనింగ్ స్టార్‌గా నిలిచాడు. తల్లిదండ్రులు రైతు కూలీలైనా చదువుకు పేదరికం అడ్డు కాదని నిరూపించాడు. రావికమతం మండలం జెడ్.కొత్తపట్నం గ్రామానికి చెందిన ఈ విద్యార్థి అదే గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూల్లో పది వరకు చదివాడు. అమ్మ ఒడి పథకం అతనిని ఆదుకుంది. నాడు–నేడుతో పాఠశాల అభివృద్ధి, 'జగనన్న గోరుముద్ద'తో చక్కని మధ్యాహ్న భోజనం అతనికి ఎంతో ఉపకరించాయి. నాటి విద్యా సంస్కరణలు అతనిని సరస్వతీ పుత్రునిగా తీర్చిదిద్దాయి.

కళాశాలకు రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకొచ్చిన శ్రీనుకు కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి, లెక్చరర్లు బాబూరావు, నాగమణి, తదితరులు బుధవారం ఘనంగా సన్మానించారు.

మద్దు గౌతమి

రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో 986 మార్కులు సాధించి టాప్ లేపింది మద్దు గౌతమి. పదో తరగతి వరకు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో చదువుకున్న ఈ బాలిక ఎస్వో తులసి, గణిత అధ్యాపకుడు సహదేవుడు సహకారంతో ఈ ఘనతను సాధించినట్టు చెప్పింది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విద్యా సంస్కరణలు ఎంతగానో దోహదపడ్డాయని తెలిపింది. ప్రిన్సిపల్ ఎం.అప్పలరాజు తదితరులు అభినందించారు.



శ్రీనును సన్మానిస్తున్న కొత్తకోట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి, లెక్చరర్లు



తండ్రి నాయుడుతో కంట్రెడ్డి రాజులమ్మ



విద్యాశాఖ మంత్రి లోకేష్ నుంచి పురస్కారం అందుకుంటున్న మౌళి కిరణ్, మద్దు గౌతమి, సిరసపల్లి హరిత, గొలగాన శ్రీను

అంటరాని వారిగా చూస్తున్నారా..

- చందనోత్సవ సమీక్షకు బండారుకు అందని ఆహ్వానం
- వివక్ష చూపిస్తున్నారని అసంతృప్తి

మహారాణిపేట : సింహాచలం చందనోత్సవ ఏర్పాట్లపై జరిగిన సమీక్ష సమావేశానికి తనను ఆహ్వానించకపోవడంపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రిగా, సీనియర్ నేతగా ఉన్నప్పటికీ తనను విస్మరించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సింహాచలంలో బుధవారం జరిగిన ఈ సమావేశానికి తనను పిలవకపోవడంపై జెడ్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను వెళ్లగక్కారు. 42 ఏళ్ల రాజకీయ జీవితంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన తనను ఇలా విస్మరించడం బాధాకరమన్నారు. పెందుర్తి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు పనిచేసిన తాను స్థానికుడినని, సింహాద్రి అప్పన్నపై తనకు ఎంతో భక్తి ఉందన్నారు. తన తండ్రి, కుమారుడి పేర్లు కూడా స్వామివారి పేరుతోనే ఉంటాయని గుర్తు చేశారు. తాను మంత్రిగా మూడుసార్లు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించానని చెప్పారు. సమావేశం నిర్వహించడం తప్పు కాదని, కానీ తమను అంటరాని వారిగా చూడటం బాధ కలిగించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అందరినీ కలుపుకుని వెళ్లాలని చెబుతుంటే, ఇక్కడ మాత్రం వేరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే రోజు రెండు ముఖ్యమైన సమావేశాలు పెట్టారని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కూడా వ్యాఖ్యానించారు.

గ్రామీణ ప్రగతికి మోకాలడ్డు



జెడ్పీ సమావేశంలో పోడియం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు.. వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్ తదితరులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనురాధ

- ఎమ్మెల్యేలు, అధికారులపై జెడ్పీటీసీలు, ఎంపీపీల ధ్వజం
- యలమంచిలి ఎమ్మెల్యే వైఖరిపై తీవ్ర అభ్యంతరం
- గరంగరంగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట (విశాఖ): గ్రామాలు, మండలాల్లో వివిధ అభివృద్ధి పనులకు కొంతమంది ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మోకాలడ్డుతున్నారని పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధోరణి ఎక్కువగా యలమంచిలి నియోజకవర్గంలో ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. యలమంచిలి నియోజకవర్గ జెడ్పీటీసీలు, ఎంపీపీలు పోడియంను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా ఇతర జెడ్పీటీసీలు, ఎంపీపీలు నిరసన తెలిపారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇతర జిల్లా పరిషత్ నిధుల వినియోగంలో జెడ్పీటీసీలకు, ఎంపీపీలకు పూర్తి హక్కులు ఉంటాయని, కానీ ఎమ్మెల్యే చెప్పిన పనులే అధికారులు చేస్తున్నారని, తాము ఉత్సవ విగ్రహాలుగా మిగిలామని మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోమ సత్యనారాయణ అన్నారు. తాము కూడ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచామని, ఎమ్మెల్యే చెప్పిన పనులు చేయకపోతే బిల్లులు ఎలా వస్తాయో చూస్తామని బెదరించడం తగదని సభ్యులు వాపోయారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మరే నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి లేదని, యలమంచిలిలో విచిత్రమైన ధోరణి ఉందని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు.

స్కూలు ప్రహరీ నిర్మించమంటే స్పందన శూన్యం: అనురాధ

కె.కోటపాడులో పాఠశాల విద్యార్థుల కోసం ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టమని అడుగుతున్నా అధికారులు పట్టించుకోకుండా కిచెన్ గార్డెన్ నిర్మాణం చేస్తున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కమిటీ చైర్‌పర్సన్, కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ ఆక్షేపించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ప్రహరీ గోడ ఎత్తు పెంచమని ఎప్పటి నుంచో అడుగుతున్నామని, అధికారులు అది తప్పితే అన్ని పనులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


గడువు పూర్తయినా మందుల విక్రయం

మందుల షాపుల్లో గడువు పూర్తయిన మందులు విక్రయిస్తున్నారని, దీనిని ఎవరూ పట్టించుకోవడం లేదని, జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదని పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చెయ్యపేట సభ్యుడు దొండ రాంబాబు మాట్లాడుతూ.. తాను మందుల కోసం ఔషధ నియంత్రణ ఏడీకి ఎన్నోసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని, ఒక ప్రజాప్రతినిధి ఎందుకు ఫోన్ చేస్తున్నారోనన్న కనీస ఆలోచన అధికారులకు లేదన్నారు. వచ్చే సమావేశానికి ఉమ్మడి జిల్లాలో ఎన్ని షాపులు ఉన్నాయో, ఎన్ని తనిఖీలు చేశారో, ఎన్నింటిపై చర్యలు తీసుకొన్నారో తెలియజేయాలని చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ పనులు, రూరల్ వాటర్ సప్లై, ఇరిగేషన్, రోడ్లు, భవనాల శాఖ, తదితర అంశాలపై చర్చ జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు జరిగిన అనంతరం చేపడుతున్న తక్షణ సహాయ కార్యక్రమాల కంటే ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

అందరికీ ఒకే రకమైన ఎక్స్‌గ్రేషియా

ముందుగా అనకాపల్లి జిల్లా, కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా పేలుడులో మృతి చెందిన ఎనిమిది మంది కార్మికుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఫార్మా కంపెనీలలో, ఇతర ప్రమాదాలలో ప్రమాదవశాత్తు మరణించిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఒకే రకమైన ఎక్స్‌గ్రేషియా అందించాలని శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. అందుకు జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానించేందుకు చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ తెలిపారు. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, విశాఖ, అల్లూరి జిల్లాల జాయింట్ కలెక్టర్లు కె.మయూర్ అశోక్, డాక్టర్ అభిషేక్ గౌడ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, రేగం మత్స్యలింగం, జిల్లా పరిషత్ సీఈఓ నారాయణమూర్తి సమావేశంలో పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు అవాస్తవం



ఏజెన్సీలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 98 కిలోమీటర్లు మాత్రమే రోడ్లు వేశారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదని అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి అన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ అరకులో పర్యటించిన సమయంలో గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడతామని చెప్పడం మంచిదన్నారు. కానీ రోడ్లకు సంబంధించి పవన్ చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదన్నారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ పనిచేయలేదని చెప్పడం సంబంధిత మంత్రిగా ఆయనకు తగదన్నారు. విశాఖ మన్యంలో గత ఐదేళ్లలో 498 కిలోమీటర్ల మేర రోడ్లు వేసినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో మన్యం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. మన్యంలో అన్ని పీహెచ్‌సీలు, పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించినట్లు తెలిపారు. నాడు–నేడు పనులతో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. వీటిని చెప్పకుండా రోడ్లు బాగులేవని ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

పట్టపగలే చుక్కలు చూపిస్తారు..



చోరీ కేసుల నిందితుల గురించి వివరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

- తాళం వేసుంటే ఇట్టే దోచేస్తారు
- రెండేళ్లలో 21 దొంగతనం కేసులు
- బాలుడితో సహా ఆరుగురు ముఠా అరెస్టు
- నిందితుల నుంచి 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి, రూ.15 వేల నగదు స్వాధీనం

అనకాపల్లి: సాధారణంగా రాత్రి పూట దొంగతనాలు చేస్తారు.. అందరూ నిద్రలో ఉన్నప్పుడు ఎవరికీ కనబడకుండా పని కానిచ్చేస్తారు.. కానీ ఈ ముఠా మాత్రం ఎంచక్కా పగలే చోరీలు చేస్తారు.. గుట్టుచప్పుడు కాకుండా, పక్కింటికి కూడా తెలీకుండా ఇళ్లు దోచేస్తారు.. అదీ వారి ప్రత్యేకత. వారి పనితనం చూసి పోలీసులే విస్తుపోయారు. ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసులకు చిక్కిన ఈ ముఠా వివరాలు వెల్లడించారు. ఈ బృందంలో ఒక బాలుడితో సహా ఆరుగురు ఉన్నారు. అందరూ దగ్గరి బంధువులే. వీరు 2023 నుంచి ఇంతవరకు మొత్తం 21 దొంగతనాల్లో పాల్గొన్నారు. వీరి నుంచి 63 తులాల బంగారం, 6.5 తులాల వెండి వస్తువులు, రూ.15 వేల నగదును కోటవురట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోటవురట్ల మండలం రాజుపేట గ్రామానికి చెందిన పాలమరశెట్టి దుర్గాప్రసాద్, భీశెట్టి లోకేష్, యల్లపు భూపతి, మడుతూరి సూర్య, మునగపాక మండలం జంగాలవీధికి చెందిన దొడ్డి ఆదిబాబుతో పాటు కోటవురట్ల మండలానికి చెందిన ఒక బాలుడు ఈ ముఠాలో ఉన్నారు. ప్రధాన నిందితుడు పాలమరశెట్టి దుర్గాప్రసాద్ చిన్నతనంలో తండ్రి మరణించడంతో జల్సాలకు బానిసై ఆన్‌లైన్ బెట్టింగ్ చేసేవాడు. డబ్బుల కోసం చోరీలకు అలవాటు పడ్డాడు. దొంగలించిన బంగారాన్ని తన బావమరిది దొడ్డి ఆదిబాబు వద్ద భద్రపరిచేవాడు. అప్పటికే ఆదిబాబు తొమ్మిది మోటార్ సైకిల్ దొంగతనాల కేసుల్లో నిందితుడు. పై ఆరుగురు వ్యక్తులు రెండేళ్ల కాలంలో కోటవురట్ల మండలంలో 6, నర్సీపట్నం రూరల్‌లో 3, మాకవరపాలెంలో 3, కశింకోటలో 3, బుచ్చెయ్యపేటలో 2, యలమంచిలి టౌన్‌లో 1, నాతవరం మండలంలో 1, యలమంచిలి రూరల్‌లో 2 చోరీలకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకున్నామన్నారు. కశింకోట మండలంలో చోరీ మాత్రమే రాత్రి పూట చేశారని, మిగిలినవి ముందుగా పగటి వేళ రెక్కీ నిర్వహించి, ఉదయం పూట దర్జాగా చేశారని ఆయన పేర్కొన్నారు. బుధవారం నిందితులను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని, బాలుడిని జువనైల్ హోమ్‌కు తరలించామన్నారు.

జాగ్రత్త సుమా

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే ప్రశ్నించాలని, విలువైన ఆభరణాలను బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని ఎస్పీ సూచించారు. గృహాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం వలన చోరీలకు పాల్పడిన వ్యక్తులను తొందరగా పట్టుకోగలమన్నారు. అనంతరం పై కేసుల్లో ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రశంసాపత్రాలతో ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు, నక్కపల్లి సర్కిల్ సీఐ ఎల్.రామకృష్ణ, ఎస్‌ఐలు ఎస్.రమేష్, పి.రమేష్, సీసీఎస్ ఏఎస్‌ఐ కేజేఐజీపీ కుమార్, విశ్వేశ్వరరావు, హెచ్‌సీ శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేలుడు పదార్థాల తయారీ కేంద్రం తనిఖీ



గొంపలో పేలుడు పదార్థాల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రఘువర్మ

రావికమతం: అనుమతుల్లేకుండా బాణసంచా తయారు చేసిన , పేలుడు పదార్థాలు నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కొత్తకోట సీఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలో గొంప గ్రామంలో శ్రీజా శాండ్ ఎల్ఎల్‌పీని సీఐ కోటేశ్వరరావు, రావికమతం ఎస్ఐ రఘువర్మ సిబ్బంది కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీజా శాండ్ ఎల్ఎల్‌పీ 2014 నుంచి మాగజైన్ లైసెన్స్ కలిగి ఉన్నారని, జన సంచారం లేని ప్రాంతంలోనే కలిగి ఉందని, లైసెన్స్ కలిగిన ప్రాంతంలో నివాసాలు, ఇతర నిర్మాణాలు లేవని తెలిపారు. లైసెన్స్ హోల్డర్‌ను, హ్యాండ్లింగ్, నిల్వ సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలని హెచ్చరించారు.

'ఉపాధి' క్షేత్ర సహాయకుల సమ్మె నోటీస్

సబ్బవరం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకు దిగుతామంటూ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు హెచ్చరించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మజను కలిసి, సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమ 19 సంవత్సరాల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని, గ్రామ పంచాయతీ ఉద్యోగులు గుర్తించి, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అంతర్గత బదిలీలు చేయడం ద్వారా స్థానిక ఒత్తిడిలను అధిగమించి, మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. విధి నిర్వాహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించి, రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాల పెంపు, విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పనులు సరే...పైసలేవి!

- నిలిచిన చెల్లింపులు
- అధికారుల చుట్టూ కాంట్రాక్టర్ల ప్రదక్షిణలు

నర్సీపట్నం : గోతులు పూడ్చారు..కానీ పైసల కోసం కాంట్రాక్టర్లకు ఎదురుచూపులు తప్పడం లేదు. అప్పు, చొప్పు చేసి పెట్టుబడి పెట్టిన కాంట్రాక్టర్లు డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్రాంతి నాటికల్లా ఎక్కడా చిన్న గొయ్యి కూడా ఉండడానికి వీలు లేదని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు నిధులు మంజూరు చేయడంతో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లాలో రోడ్లు భవనాలశాఖ అధికారులు 14 సెక్షన్‌ల్లో గుంతలు పూడిచే పనులు చేపట్టారు. సంక్రాంతి నాటికే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. అధికారులు వెంటపడి సంబంధిత పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లచే నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయించారు. పనులు పూర్తయి సుమారు మూడు నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం అర్అండ్‌బీ అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. పనులు జరిగినంత తొందరగా..బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్త పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు.

సకాలంలో పనులు పూర్తి చేసినా...

జిల్లాలో నర్సీపట్నం, పాయకరావుపేట, కె.కోటపాడు, కె.డి.పేట, సబ్బవరం, పెదబొడ్డేపల్లి, పరవాడ, అచ్యుతాపురం, నక్కపల్లి, వి.మాడుగుల,



గుంతలు పూడ్చిన నర్సీపట్నం-చింతపల్లి రోడ్డు (ఇన్‌సెట్) గుంతలు పూడ్చుతున్న దృశ్యం

దార్లపూడి, చోడవరం, అనకాపల్లి, యలమంచిలి సెక్షన్‌ల్లో రూ.8.80 కోట్లతో 119 వర్కులకు గాను 521.32 కిలో మీటర్ల పొడవున రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. కేవలం రూ.70 లక్షలు మాత్రమే కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమచేశారు. మిగిలిన రూ.8.10 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. సకాలంలో పనులు పూర్తి చేసిన ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో బిల్లులు చెల్లింపు నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వంలో నిధులు పుష్కలంగా వస్తాయనే ఆశతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు అప్పులు చేసి మరి పనులు చేపట్టారు. ప్రభుత్వ సంకల్పం నెరవేరింది కానీ కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరగలేదు. కాంట్రాక్టర్లను వెంటపడి పనులు చేయించిన అధికారులు సైతం బిల్లుల విషయంలో సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు అందకపోవడంతో చేసిన అప్పులకు కాంట్రాక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా ఇన్‌ఛార్జీ ఈఈ విద్యాసాగర్‌ను సంప్రదించగా రూ.70 లక్షల వరకు బిల్లులు చేశాం.. నిధులు విడుదలైన వెంటనే మిగిలిన పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారు.

రాజయ్యపేట నిర్వాసితులకు పరిహారం ప్రకటించిన ఆర్డీవో

- పరిహారం పెంచాలని డిమాండ్ చేసిన సీపీఎం నాయకులు



వినతి పత్రం ఇస్తున్న నిర్వాసితులు

నక్కపల్లి : విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా రాజయ్యపేట సమీపంలో బల్క్ డ్రగ్ పార్క్‌నిర్మాణంలో నివాస ప్రాంతాలు కోల్పోతున్న నిర్వాసితులకు రూ.8.36 లక్షల ప్రత్యేక ప్యాకేజీ, పెదబోదిగల్లం వద్ద ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. బుధవారం ఆయన డీఎల్ పురం, బోయపాడు, రాజయ్యపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణలో నిర్వాసితులైన వారికి పూర్తి స్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించిన తర్వాతే పరిశ్రమలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మూడు గ్రామాల్లో ఇళ్లు, నివాస ప్రాంతాలు కోల్పోతున్నవారు 346 మంది ఉన్నారన్నారు. వీరందకి 2024 డిసెంబరు 31 తేదీని కటాఫ్ తేదీగా నిర్ణయించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ఈ కటాఫ్ తేదీ ఆధారంగా 18 సంవత్సరాలు నిండిన వారితో అర్హులైన వారి జాబితా సిద్ధం చేశామన్నారు. 346 మందితో కూడిన జాబితా తయారు చేయడం జరిగిందన్నారు. వీరందరికీ రూ.8.36లక్షల నగదు సాయం, ఐదుసెంట్ల ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. వీరందరికీ త్వరలోనే ప్యాకేజీ చెల్లించడం జరుగుతుందన్నారు. బోదిగల్లం వద్ద పునరావాసం కల్పించేందుకు భూసేకరణ చేస్తున్నామన్నారు. అక్కడ లేఅవుట్ వేసి తాగునీరు సదుపాయం కల్పించి ఇంటి స్థలం కేటాయించడం జరుగుతుందన్నారు. నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించిన తర్వాతే భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు ఈ సందర్భంగా సీపీఎం నాయకులు అప్పలరాజు, పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ నిర్మాణ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ప్యాకేజీ పెంచాలని 18 ఏళ్లు నిండిన వారికి రూ.25 లక్షల చొప్పున చెల్లించాలన్నారు. బోయపాడు గ్రామానికి చెందిన నిర్వాసితులు మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్క్ కోసం గ్రామంలో సగం మందిని, ఇళ్లను ఖాళీ చేయించి మిగిలిన వాళ్లను వదిలేయడం కుదరదన్నారు. ఖాళీ చేయించాల్సిన పరిస్థితి వస్తే మొత్తం గ్రామాన్ని ఖాళీ చేయించి వేరొక చోట పునరావాసం కల్పించాలన్నారు. చేతి వృత్తుల వారికి కూలీలకు, దళితులు, మత్స్యకారులకు రూ.15 లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లించాలన్నారు. నిర్వాసితుల డిమాండ్లను, వారి వినతులను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో అన్నారు. అర్హత కలిగి ప్యాకేజీ జాబితాలో పేర్లు లేనివారు వారం రోజుల్లో అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అర్.నర్సింహమూర్తి, డీఎల్‌పురం సర్పంచ్ కె.రామకృష్ణ, ఎంపీటీసీ కనకారావు, మాజీ సర్పంచ్ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ రమణ పాల్గొన్నారు.

యువ రచయితలకు ఘన సత్కారం

- ఘనంగా తెలుగు నాటకరంగ దినోత్సవం



నటరాజునికి నివాళ్లర్పిస్తున్న కళాకారులు



యువ రచయితలు శేఖర్, జగన్నాథరావు, జగ్గప్పారావులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : తెలుగు నాటక రంగ దినోత్సవం బుధవారం మునగపాకలో ఘనంగా నిర్వహించారు. గ్రామీణయువజన మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు పలువురు రచయితలు, దర్శకులు, కళాభిమానులు హాజరయ్యారు. ముందుగా నటరాజుకి నివాళులర్పించారు. గ్రామీణ సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము మాట్లాడుతూ నాటకరంగ ఖ్యాతిని ఉభయరాష్ట్రాల్లో ఇనుమడింపచేయడంలో యువజన మందిరం పాత్ర కీలకమైందన్నారు. ప్రతి యువ రచయిత సందేశాత్మక రచనలు అందించాలన్నారు. సమాజానికి మేలు చేకూర్చే నాటకాలు రావాల్సి ఉందన్నారు. కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. మునగపాకలో గ్రామీణ స్థాయిలో కూడా పరిషత్‌లు నిర్వహించేలా చూడాలన్నారు. స్థానిక కళాకారులను కూడా ప్రోత్సహించాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి నాటిక పోటీలకు వేదికైన మునగపాకకు మరింత గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం మునగపాకకు చెందిన యువ రచయితలు దాడి జగన్నాథరావు, ఆడారి సోమశేఖర్, విల్లూరి జగ్గప్పారావులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మళ్ల సంజీవరావు, దాడి మునిలినాయుడు, కాంద్రేగుల జగ్గారావు, మొల్లేటి సత్యనారాయణ, పొలిమేర కృష్ణ, ఆడారి అచ్చియ్యనాయుడు, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, అలంక ప్రకాశరావు, పిల్లి అప్పారావు, పెంటకోట సత్యనారాయణ, మందిర కార్యదర్శి ఆడారి సూర్యచంద్రరావు, దాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ : విద్యార్థులు చిన్నతనం నుండి చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలని, సమాజం కోసం కొంతైనా పాటు పడాలని కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. బుధవారం కృష్ణదేవిపేట జిల్లా పరిషత్‌లో ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులు ఎస్‌సీసీ క్యాంపెన్‌లో మంచి ప్రతిభ కనపరచడంతో వారికి ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేశారు. కృష్ణదేవిపేట ఏఎస్ఐ ఆళ్ల నూకరాజు విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వడంతో ఏఎస్ఐకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ బాగా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, లోచల రమేష్, పీఈటీ రమణ పాల్గొన్నారు.

<table>
<tr><th colspan="6">NARSIPATNAM MUNICIPALITY</th></tr>
<tr><td colspan="6">Roc.No.448/2020/E1 — TENDER NOTICE — Dated: 16.04.2025
Narsipatnam Municipality inviting the following Tenders on 'e'-procurement Platform under Municipal General Funds.</td></tr>
<tr><th>Sl. No.</th><th>Grant Name and No of Works</th><th>Tender Call</th><th>Total Value</th><th>Download Starting Date & Time</th><th>Download Ending Date & Time</th></tr>
<tr><td>1.</td><td>01 Work (General Fund)</td><td>1st Call</td><td>Rs. 2.50 Lakhs</td><td>17-04-2025 by 10:00 AM</td><td>24-04-2025 by 04:30 PM</td></tr>
<tr><td>2.</td><td>16 Works (General Fund)</td><td>1st Call</td><td>Rs. 44.54 Lakhs</td><td>17-04-2025 by 10:00 AM</td><td>02-05-2025 by 04:30 PM</td></tr>
<tr><td colspan="6">For details logon to https://tender.apeprocurement.gov.in/ Contact Ph. No. 9494189575, 7702495544
Sd/- J.Surendra, Commissioner, Narsipatnam Municipality</td></tr>
</table>

ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలి



పీహెచ్‌సీ డాక్టర్‌కు సూచనలు చేస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ వీరజ్యోతి

నర్సీపట్నం : వీలైనంత వరకు ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి వైద్యులకు సూచించారు. నర్సీపట్నం మండలం, వేములపూడి పీహెచ్‌సీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మందుల గది, రక్త పరీక్షలు చేసే ల్యాబ్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ప్రసవానికి వచ్చే ప్రతి కేసును రిఫర్ చేయకుండా సాధ్యమైనంత వరకు ఆస్పత్రిలోనే అయ్యేలా చూడాలని డాక్టర్ సుమకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రిఫర్ చేసిన కేసులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి మాత్రమే తీసుకువెళ్లాలని, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లినట్టు రుజువైతే చర్యలు తీసుకుంటామని ఆశ కార్యకర్తలను హెచ్చరించారు. ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు అందించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనకాపల్లి టౌన్ : కొత్తూరు జంక్షన్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఎన్జీవోస్ కాలనీ నుంచి జాతీయ రహదారికి ద్విచక్ర వాహనంపై పరికి ప్రసాద్(60), అతని భార్య ఇద్దరూ వస్తున్నారు. అదే రూట్‌లో ఉమ్మలాడ నుంచి కశింకోట వెళుతున్న మరో ద్విచక్ర వాహనం వెనక నుంచి బలంగా ఢీకొంది. దీంతో ప్రసాద్ దంపతులిద్దరికీ తీవ్ర గాయాలవ్వగా, రెండో వాహనంపై వస్తున్న వాహనదారుడికి గాయాలయ్యాయి. ముగ్గురినీ హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన ప్రసాద్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

బండరాళ్ల లారీలో మంటలు



బండరాళ్ల లారీలో మంటలు అంటుకున్న దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని వెంకటాపురం నుంచి యలమంచిలి వెళ్లే మార్గంలో బండరాళ్లతో వెళుతున్న లారీ అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుంది. బుధవారం మధ్యాహ్నం ఈ మార్గంలో వెళుతున్న లారీ క్యాబిన్‌లో ముందు పొగలు వ్యాపించి, తర్వాత మంటలు రావడంతో డ్రైవర్, క్లీనర్లు దూకేశారు. దీంతో ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఈ వాహనంలో మంటలను చూసి ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. వాహన సామర్థ్యానికి మించి భారీ లోడ్‌తో బండరాళ్లతో వెళ్లడం, వేడిని నియంత్రించాల్సిన యంత్రాలు వడగాడ్పులకు మంటల వ్యాప్తికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

మద్యం మత్తులో మురుగుకాల్వలో పడి మృతి

చోడవరం : మద్యం మత్తులో ఒక వ్యక్తి మురుగుకాల్వలో పడి మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం అనకాపల్లికి చెందిన కుడిమి యేసు (40)అనే వ్యక్తి తమ బంధువుల ఇంటికి చోడవరం వచ్చారు. పూటుగా మద్యం సేవించి మెయిన్‌రోడ్డుపై ఉన్న మెయిన్ డ్రైన్ గట్టుపై పడుకొని ప్రమాదవశాత్తూ అందులో పడి మృతిచెందాడు. బుధవారం ఉదయం చోడవరం పంచాయతీ శానిటేషన్ సిబ్బంది కాల్వను శుభ్రంగా చేసే క్రమంలో చూడగా అందులో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి వివరాలు సేకరించారు. బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అప్పలరాజు చెప్పారు.

ఉపాధి మేట్ తొలగింపుపై నిరసన



ఎంపీడీవో, ఎంపీపీలకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

చీడికాడ : నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ మేట్‌ను తొలగించి కూటమి నేతలకు అనుకూలంగా ఉన్న మరో వ్యక్తిని నియమించడంపై మండలంలోని బైలపూడికి చెందిన ఉపాధి కూలీలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. వీరికి వైఎస్సార్‌సీపీ నేతలు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన 38 సభ్యులు(కూలీలు)గల చంద్రాదేవి గ్రూపునకు జాజిమొగ్గల చంద్రదేవి మేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలిగా భావించిన స్థానిక కూటమి నేతలు తనను ఎలాగైనా మేట్ పదవి నుంచి తప్పించాలని కొంతకాలంగా ప్రయత్నిస్తున్నారని కూలీలు గాడి కన్నతల్లి, లక్ష్మి, మోసూరి లక్ష్మి, మహాలక్ష్మి, జె.అప్పారావు, లక్ష్మి తెలిపారు. ఈ విషయం తమకు తెలిసి ముందస్తుగానే నెలరోజుల క్రితం ఏపీవో గంగునాయుడు దృష్టికి తీసికెళ్లి మేట్‌ను మార్చవద్దని లిఖితపూర్వకంగా చెప్పామన్నారు. అయితే దానిని పక్కన పడేసి వీఆర్‌పి గాడి లక్ష్మి ఆమె భర్త సత్యనారాయణలు ఏపీవోతో కూడి చంద్రదేవిని తొలగించామని చెప్పారన్నారు. తమ పేరిట తప్పుడు సంతకాలు చేయించుకున్న వీఆర్పీ గాడి లక్ష్మిని, తొలగించడంలో సహకరించిన ఏపీవో గంగరాజుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి నేతల కుట్రలకు ఉద్యోగులు సహకరిస్తే గ్రామాల్లో జరిగే అలజడులకు అధికారులదే బాధ్యత అని, తప్పులు జరగకుండా చూడాలని లేకుంటే ప్రజలు తిరగబడతారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురాచా జయమ్మలు ఎంపీడీవో వద్ద హెచ్చరించారు.

దేవరాపల్లి సబ్‌స్టేషన్‌లో చెలరేగిన మంటలు

ఆరు గంటలకు పైగా నిలిచిన విద్యుత్ సరఫరా

దేవరాపల్లి : దేవరాపల్లి మండలాన్ని బుధవారం అంధకారం అలుముకుంది. మధ్యాహ్నం కురిసిన కొద్దిపాటి వర్షానికి స్థానిక విద్యుత్ స్టేషన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం నుండి రాత్రి 9:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలంతా చీకట్లో మగ్గారు.

సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు బాగు చేసే వరకు వేచలం సబ్ స్టేషన్ నుంచి మండల కేంద్రం దేవరాపల్లికి విద్యుత్ సరఫరాను ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని స్థానిక ఎలక్ట్రికల్ ఏఈఈ కె. శంకరరావు తెలిపారు. కాగా 9:45 గంటల ప్రాంతంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఆన్‌లైన్ సంగీత ప్రదర్శనకు గిన్నిస్ బుక్‌లో చోటు



అవార్డు అందుకుంటున్న సుధీర్

రోలుగుంట : మండల కేంద్రం సియోను సహవాస సేవకుడైన నాగం ఏసురాజు కీ బోర్డు సంగీతంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు చిన్నప్పటి నుంచి సంగీత వాయిద్యంపై మక్కువ అని తెలిపారు. చర్చ్‌కు వెళుతూ క్రిష్టియన్ గీతాలు ఆలపించేవాడినని, చర్చిలో పాస్టర్‌గా సేవలందిస్తున్నానని తెలిపారు. కీ బోర్డు సంగీతంపై నైపుణ్యం పెంచుకుని, హలల్ మ్యూజిక్ స్కూల్ ప్రోత్సాహంతో క్రిష్టియన్ గీతాలపై ప్రపంచ స్థాయిలో గత ఏడాది డిసెంబర్ 1న నిర్వహించిన ఆన్‌లైన్ సంగీత పోటీల్లో పాల్గొని గంటలో 1046 వీడియోలు అప్‌లోడ్ చేసినట్టు తెలిపారు. తన ప్రతిభను గుర్తించిన హెల్లెల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ పాస్టర్ అగస్టిన్ దండంగి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్‌కు పార్టిసిపేషన్ ధ్రువపత్రం, మెడల్ అందజేసినట్టు తెలిపారు. ఈ గుర్తింపుతో తన కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో 18 దేశాల నుంచి సంగీత వాయిద్య కళాకారులు పాల్గొన్నట్టు విలేకరులకు తెలిపారు.

రావికమతం : మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు గల్లా సుధీర్ గిన్నిస్ బుక్ వరల్డ్‌లో చోటు దక్కించుకున్నారు. విజయవాడకు చెందిన హలల్ మ్యూజిక్ సూల్క్‌కు చెందిన 18 దేశాల విద్యార్థులు గత ఏడాది డిసెంబరు 1న ఆన్‌లైన్ వేదికగా సమగ్రత,సమైక్యతపై ఏడు రకాల సంగీత వాయిద్యాలను కీబోర్డు పై ఒక్క గంటలో వినిపించడమే కాక ఇన్‌స్టాలో అప్లోడ్ చేశారు. సుమారు 1100 మంది పాల్గొన్న పోటీలలో మండలంలో పెదపాచిల పాఠశాలలో పనిచేస్తున్న సుధీర్ ఉత్తమ పదర్శన కనబరిచారు. దీనిని గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో ఉత్తమ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇచ్చి గౌరవించింది. ఈ నెల 14 న విజయవాడలో హలల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ అగస్టిన్ దండంగి అవార్డ్ అందచేశారు. సుధీర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అందరికీ పనులు కల్పిస్తున్నాం

నర్సీపట్నం: జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరుకి ఉపాధి పనులు కల్పిస్తున్నామని మాకవరపాలెం ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ వివక్ష చూపించకుండా పనులు కల్పిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు. మామిడిపాలెంలో కూలీలకు పనులు కల్పించేందుకు డిమాండ్ ఇచ్చి మస్తర్లు జనరేట్ చేశామని ఎంపీడీవో వివరించారు.

తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

గొలుగొండ : గొలుగొండ తహసీల్దార్ శ్రీనివాసరావును దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. పాకలపాడు గ్రామానికి చెందిన ఎ. వెంకటరమణ మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయనను దూషించడంతో తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పెదబొడ్డేపల్లిలో మూడు ఇళ్లలో చోరీలు



శ్రీరామమ్మూర్తి ఇంట్లో చెల్లాచెదురుగా బట్టలు



భవానీ ఇంట్లో లాకర్ విరగ్గొట్టిన దొంగలు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ 11వ వార్డు పెదబొడ్డేపల్లి థెరిస్సా కాలనీలోనే మంగళవారం రాత్రి ఈ మూడు చోరీలు జరగడం విశేషం. ఎం.సత్యసారథి తన తండ్రికి ఆరోగ్యం బాగోకపోవడంతో ఈ నెల 13న విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రి తీసుకువెళ్లాడు ఇంటి వద్ద ఎవరూ లేరని గమనించిన దొంగలు ఇంట్లో ప్రవేశించి ఏడు తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేలు నగదు పట్టుకుపోయారు. ఇంటి తలుపులు తీసి ఉండడంతో ఇంట్లో అద్దెకు ఉంటున్నవారు సారథికి సమాచారం అందించడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడకు కూతవేటు దూరంలోని బత్తిన రామకృష్ణ ఇంట్లో కూడా దొంగతనం చోటుచేసుకుంది. రామకృష్ణ పూడిమడక వద్ద నిర్మితమవుతున్న పోర్టులో విధులకు వెళ్లగా, అతని భార్య భవాని పాపను తీసుకుని అమ్మ గారు ఊరులో జరుగుతున్న పండగకు వెళ్లింది. దీంతో ఆ ఇంట్లో దొంగలు ప్రవేశించి రెండు తులాలు బంగారు ఆభరణాలు, 25 తులాలు వెండి ఆభరణాలు అపహరించారు. తలుపులు తీసి ఉండడంతో ఎదురింటి వారు సమాచారం ఇవ్వడంతో భవాని హుటాహుటిన ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే ఇక్కడకు మరి కొంత దూరంలో ఉన్న విశాఖ ఎయిర్‌పోర్టులో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అడిగర్ల శ్రీరామమ్మూర్తి ఇంట్లో కూడా దొంగలు చోరీకి పాల్పడ్డారు. విధి నిర్వహణలో భాగంగా శ్రీరామమ్మూర్తి భార్యతో విశాఖలో ఉంటున్నారు. ఇంటికి సీసీ కెమెరాలు పెట్టి సెల్‌కు వైఫై కనెక్షన్ ఇచ్చారు. రాత్రి దొంగలు ఇంట్లోకి ప్రవేశించడం వైఫైలో హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు శ్రీరామమ్మూర్తికి సమాచారం అందించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఇంట్లోని ఆరు తులాలు వెండి అభరణాలు చోరీ అయ్యాయి. ఒకే ఏరియాలో ప్లాన్ ప్రకారం దొంగలు చోరీకి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. ఫిర్యాదులు అందుకున్న పట్టణ సీఐ గోవిందరావు, క్లూస్ టీమ్ సిబ్బందితో ఆనవాళ్లు సేకరించారు. వరుస దొంగతనాలతో థెరిస్సా కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, జె.తుని, ఎన్.జి.పాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరు, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, చిన ఏనుగుతుని, జి.భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకువానిపాలెం గ్రామాల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు అవసరం

అనకాపల్లి టౌన్: ప్రజలు బయటకు వచ్చేటప్పుడు వడదెబ్బకు గురికాకుండా కాటన్ వస్త్రాలను ధరించాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ బి.మంగమ్మ సూచించారు. మండలంలోని చిన మాకవరం గ్రామంలో వేసవిలో వడదెబ్బ నుంచి తీసుకోవలసిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయట విక్రయించే పానియాలు తాగరాదని, మంచినీరు, మజ్జిగ వంటివి మాత్రమే తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు ఇంటి వద్దనే ఉండాలన్నారు. అత్యవసర పనులపై వెళ్లే ప్రజలు గొడుగు, టోపీ తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాణి జగదీశ్వరీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్స్ ప్రాజెక్టుల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు ప్రశంసలు లభించాయని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం తెలిపారు. టీసీఎస్ ఆధ్వర్యంలో గో-ఐటీ డిజిటల్ ఇన్నోవేషన్, కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాంకు 8వ తరగతి విద్యార్థులు డి.విశ్వనాథ్, ఎల్.మున్నా, ఎం.అశోక్, జై నిశాల్, 9వ తరగతి విద్యార్థులు కె.యోగేంద్ర, జె.సందీప్‌లు డెవలప్ చేసి పంపించిన పృథ్వీ యాప్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విప్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విప్రో ఎర్తియన్‌కు ఎం.ధనుంజయ్, డి.విశ్వనాథ్, కె.శ్రీను, పి.ప్రవీణ్ కుమార్, డి.ధర్మతేజ పంపిన ప్రాజెక్టు ప్రశంసా పత్రాన్ని దక్కించుకుందన్నారు. గైడ్ టీచర్స్ టి.రాంబాబు, జి.జానకిరామ్‌తోపాటు, విద్యార్థులను ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సి.ప్రభావతమ్మ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 2,447 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ఠధర	గరిష్ఠధర
స్పెషల్ రకం	4,400	4,400
మొదటి రకం	3,730	4,300
రెండో రకం	3,290	4,020
మూడో రకం	3,010	3,260

అనకాపల్లి సినిమాలు

రాజా :మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: గుడ్ బ్యాడ్ అగ్లీ
సత్యనారాయణ స్క్రీన్-2 : రాజుగారి దొంగలు
పర్తిసాయి :కోర్టు
షిర్డీసాయి :అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : చెరసాల
శ్రీసత్య :సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర :జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 374 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 302 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరును సంప్రదించవచ్చు.

అధ్వాన రోడ్లకు మోక్షం



కనకమహాలక్ష్మి ఆలయం నుంచి పిసినికాడ రోడ్డుకు నిర్మించిన తారు రోడ్డు



పడమటమ్మ ఆలయానికి నిర్మించిన సిమెంట్ రోడ్డు



కశింకోట హౌసింగ్ కాలనీ వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్డు



కశింకోట కస్బా వీధిలో పడమటమ్మ ఆలయానికి నిర్మించిన తారు రోడ్డు

కశింకోట: అధ్వాన రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో కశింకోటలో తలపెట్టిన మూడు రోడ్లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. కశింకోటలో నాబార్డు, జాతీయ ఉపాధి హామీ పథకం కింద మూడు రోడ్లు నిర్మించారు. రూ.1.40 కోట్లు ఇందుకు ఖర్చు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్లు మంజూరయ్యాయి. ఇప్పటికి నిర్మాణం పూర్తయింది.

◆ కశింకోటలోని హౌసింగ్ కాలనీ వద్ద జాతీయ రహదారి నుంచి సంపద కేంద్రం, పందిరి వీధి అంగన్‌వాడీ కేంద్రం నుంచి పడమటమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి 2023-24లో రూ.1.10 కోట్లు నాబార్డు నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్లు పిలిచారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్లు ఖరారు చేసి గతేడాది పనులు చేపట్టారు. దీనిలో భాగంగా హౌసింగ్ కాలనీ వద్ద జాతీయ రహదారి నుంచి అక్కడి సచివాలయ భవనం వరకు సిమెంట్ రోడ్డు, అక్కడి నుంచి సంపద కేంద్రం వరకు తారు రోడ్డు నిర్మించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి పడమటమ్మ ఆలయ ప్రవేశం వరకు పొలాల గోర్లు మీదుగా తారు రోడ్డు, అక్కడి నుంచి ఆలయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు రోడ్లు వేయడంతో రాకపోకలకు అనువుగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కశింకోటలో రూ.1.40 కోట్లతో మూడు రోడ్ల నిర్మాణం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధుల మంజూరు

ఎట్టకేలకు పూర్తయి అందుబాటులోకి రోడ్లు



హౌసింగ్ కాలనీ వద్ద మురుగు కాల్వపై లేని పైకప్పులు

హౌసింగ్ కాలనీ వాసులకు తప్పని పాట్లు

హౌసింగ్ కాలనీని ఆనుకొని రోడ్డు నిర్మించారు. అయితే కాలనీ వాసులు ఈ రోడ్డును చేరుకోవడానికి మధ్య కాలువ అడ్డుగా ఉంది. ఆ కాలువపై ఏడు చోట్ల రాకపోకలకు అనువుగా పైన కప్పులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు నిర్మించినప్పటి పక్కన మట్టి వేయకుండా ఖాళీగా వదిలేశారు. దీని వల్ల రోడ్డు ఎత్తుగా ఉంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా రోడ్డు పక్క పల్లపు ప్రాంతంలో పడి గాయాలు పాలయ్యే ప్రమాదం ఉంది. దీని దృష్ట్యా రోడ్డు స్థాయి వరకు పక్కన మట్టి కూడా నింపడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

◆ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కశింకోట కనక మహాలక్ష్మి వీధి నుంచి పిసినికాడ వద్ద జాతీయ రహదారి వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో తాజాగా తారు రోడ్డు నిర్మించారు. ఇందుకు రూ.50 లక్షలు వెచ్చించారు. స్థానిక గవరపేటతో పాటు పిసినికాడ గ్రామస్తులకు దగ్గరి దారిగా రహదారి సౌకర్యం మెరుగుపడడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యవంతంగా రాకపోకలు



హౌసింగ్ కాలనీ నుంచి పడమటమ్మ ఆలయం వరకు నిర్మించిన రోడ్డు వల్ల పొలాలకు రాకపోకలు సాగించడానికి సౌకర్యంగా ఉంది. గతంలో ఏ మాత్రం వర్షం పడినా మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడేవారం. ఇప్పుడు రోడ్డు వేయడంతో ఆనందంగా ఉంది.

– దేవర ధర్మారావు, రైతు, కశింకోట

కాలువపై పలకలు వేయాలి



హౌసింగ్ కాలనీని ఆనుకొని రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే రోడ్డుపైకి వెళ్లడానికి కాలువ అడ్డంకిగా మారింది. ఏడు చోట్ల రాకపోకలకు అనువుగా కాలువపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు పక్క పల్లపు భాగంలో మట్టి నింపడానికి కూడా చర్యలు తీసుకోవాలి.

– మోసా చంద్రరావు, హౌసింగ్ కాలనీ, కశింకోట

2023-24లో నిధుల మంజూరు

కశింకోటలోని హౌసింగ్ కాలనీలోని జాతీయ రహదారి నుంచి పడమటమ్మ ఆలయం వరకు సిమెంట్, తారు రోడ్లు నిర్మించాం. 2023-24లో నాబార్డు నుంచి రూ.1.40 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటితో రోడ్ల నిర్మాణం పూర్తి చేశాం.

– పి.వి.శక్తికుమారి, పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్టు డీఈ, అనకాపల్లి

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు



ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట తలపెట్టిన ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 47వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఎంయూఏ జోనల్ జాయింట్ సెక్రటరీ జి.శంకరరావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పి.సుధాకర్, టి.ఆర్.రెడ్డి, ఎం.తేజ, ఎస్.జి.రాజు, ఎస్.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు టోపీలు, కళ్లద్దాల పంపిణీ



పోలీసులకు టోపీలు, కళ్లద్దాల పంపిణీలో పాల్గొన్న అలయన్స్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ట్రాఫిక్ పోలీసులకు వాసవీ క్లబ్, కెమిస్ట్ అసోసియేషన్, అలయన్స్ క్లబ్ సహకారంతో సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ కళ్లద్దాలు, టోపీలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ కుటుంబాలను పట్టించుకోకుండా ఎండలో సైతం ప్రజా సేవకే అంకితమైన పోలీసుల సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పూసర్ల రాజా, శివ, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ పండగ

పరవాడ: రావాడ శివారు ధర్మారాయుడుపేటలో కొలువైన దుర్గమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని, పసుపు కుంకుమలు సమర్పించుకునేందుకు అనువైన వసతులు కల్పించామన్నారు. ఉచిత ప్రసాదం అందిస్తామన్నారు. రాత్రికి అమ్మవారిని డప్పులు, సాముగరిడీలు, కోయడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధుల్లో ఊరేగించి, భారీ బాణసంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



సిలిండర్ నుంచి వచ్చిన మంటలను అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయపడకుండా ధైర్యంతో మంటలను ఆర్పడానికి కృషి చేయాలని అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి నాగేశ్వరరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పట్టణంలోని అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకూ పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన, మాక్‌డ్రిల్ వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. చిన్నపాటి తప్పుల వల్ల పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అవగాహన ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, అపార్ట్‌మెంట్ ప్రజలు పాల్గొన్నారు.

తుమ్మపాల గ్రామసభలో సమస్యలు ఏకరువు



సమావేశంలో మాట్లాడుతున్న తట్టా పెంటయ్యనాయుడు

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం గ్రామ సభ జరిగింది. సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో గ్రామస్తులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు గోవిందరావు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని ధ్వజమెత్తారు. పట్టపగలే లైట్లు వెలుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రేగుల రవి మాట్లాడుతూ చినబాబు కాలనీలో మంచినీటి ట్యాంక్ శుభ్రం చేయలేదన్నారు. తక్షణమే గ్రామ సభలో లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, వార్డు మెంబర్లు, స్కూల్ కమిటీ చైర్మన్ బలరాం, మాజీ సర్పంచ్ కర్రి బాబీ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



పెరుగు బజార్-గాంధీబొమ్మ సెంటర్ రోడ్డుపై నిలిచిపోయిన నీరు



అనకాపల్లి-తుమ్మపాల రోడ్డులో వర్షపు నీరు

తుమ్మపాల:జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో ఏ చోట చూసిన వర్షపు నీటితో రహదారులు చెరువును తలపిస్తున్నాయి. గత రెండు రోజుల పాటు కురిసిన వర్షంతో గోతుల్లో నీరు చేరి అధ్వానంగా తయారయ్యాయి. పట్టణంలో పెరుగు బజార్ జంక్షన్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు పాడైపోయింది. ఎన్టీఆర్ ఆసుపత్రి రోడ్డు, గూడ్స్ రోడ్డు, శారదా నది వంతెన రోడ్లు మరమ్మతులకు గురై నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. అధికారులు దృష్టి సారించి అనకాపల్లి పట్టణంలో రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఇద్దరిపై కేసులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని రహదారులపై రయ్ రయ్‌మంటూ హల్‌చల్ చేస్తున్న యువకులపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్టు బుధవారం రాత్రి పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. పట్టణంలో ఇటీవల ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకుల సంఖ్య పెరిగిపోతోంది. మంగళవారం ఇద్దరు గుర్తు తెలియని యువకులు తులసీనగర్‌లో ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు పుస్తెలతాడు బలవంతంగా తెంపుకొని స్కూటీపై పరారయ్యారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు రహదారి నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయించారు. బుధవారం ఇద్దరు యువకులపై కేసులు నమోదు చేసిన పోలీసులు రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ర్యాష్ డ్రైవింగ్ కారణంగా పాదచారులు కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు.

122 మందికి నేత్ర పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యులు

కశింకోట: కశింకోటలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న కల్యాణ మండపంలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 122 మందికి కంటి పరీక్షలు చేయగా.. 40 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వారిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైద్యాధికారి దివ్య, క్యాంపు మేనేజర్ ఎం.అరుణకుమార్, స్టాఫ్ నర్స్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు తక్షణమే అమలు చేయాలి

కశింకోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ డిమాండ్ చేశారు. కశింకోటలో బుధవారం జరిగిన సీపీఐ 4వ మండల మహా సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తుందని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి ప్రధానమంత్రి మోదీ ప్రయత్నిస్తుంటే సీఎం ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు యలమంచిలిలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, ప్రతినిధులు రామునాయుడు, సత్తిబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం



ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్: యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పట్టణ సీఐ ఎం.వెంకటనారాయణ సూచించారు. మండలంలోని ఏఎంఎల్ కళాశాలలో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘన, సైబర్ క్రైమ్, డ్రగ్స్ వినియోగంతో తలెత్తే అనర్థాలపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని ఇతరులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై లేఖలు



వెదురుపర్తి హైస్కూలు విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై రాసిన లేఖల ప్రదర్శన

కశింకోట:మండలంలోని వెదురుపర్తి హైస్కూలు విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై బుధవారం 'కుశలమా'అనే లేఖ రాసే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఏవీఎస్ మూర్తి ఈ సందర్భంగా తపాలా శాఖ అందిస్తున్న సేవలపై, మానవ సంబంధాల పెంపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా అంశాలపై ప్రజలకు కూడా అవగాహన కలిగిస్తూ సుమారు 110 మంది విద్యార్థులు బొమ్మలు, రాత పూర్వకంగా వివిధ ప్రాంతాలకు ఉత్తరాలు రాశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సబిత లక్ష్మి, పి.సత్యనారాయణమూర్తి, ఎ.నూకరాజు, సత్యవాణి, విజయ్‌కుమార్, సోమరాజు పాల్గొన్నారు.

'తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలి'



నిరసన ప్రదర్శనలో సిటు నాయకులు

పరవాడ: కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి, అక్కడి ప్రజలను ఆదుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో తాడి గ్రామంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలుష్యంలో చిక్కుకుని అల్లాడుతున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలిస్తామని రాజకీయ నాయకులు హామీలు గుప్పించడమే తప్ప, తరలించే ప్రక్రియను ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. వెంటనే గ్రామంలో రీ సర్వే జరిపి, మేజర్లయిన పిల్లలు, పక్కా భవనాలను లెక్కించి, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భవనాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కాలుష్యం వలన గ్రామంలోని ప్రజలు అనేక ఆనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. తాడి, తాడి కాలనీ, పెదతాడి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కండేపల్లి అప్పలరాజు, పితాని సన్యాసిరావు, పెంటయ్య, కనకరావు పాల్గొన్నారు.